క్లుప్తంగా

బోర్‌మోటారుకు మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్‌..

రాయపర్తి : 'తాగు నీటి కోసం ఆందోళన' శీర్షికతో ప్రచురితమైన 'సాక్షి' కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని కాట్రపల్లిలోని ఎస్సీ కాలనీలో బోర్‌మోటారు కాలిపోయి తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఈనెల 23న 'సాక్షి' ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్‌ ఆదివారం నాడు బోర్‌మోటారుకు మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండాకాలం రానున్న క్రమంలో పంచాయతీ కార్యాలయంలో మరో మోటర్‌ను భద్రపర్చినట్టు తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని ఆయన చెప్పారు. బోర్‌మోటర్‌కు మరమ్మతు చేయించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సన్మానం



నర్సంపేట రూరల్‌ : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టౌన్‌ సీఐ రమణమూర్తిని బీజేపీ నాయకులు ఆదివారం శాలువా కప్పి సన్మానించి పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బాల్నె జగన్‌, నాయకులు జూలూరి మనీశ్‌, గూడూరు సందీప్‌, ఠాకూర్‌ విజయ్‌ సింగ్‌, సామల ప్రవీణ్‌కుమార్‌, కోమాండ్ల సప్తగిరి, నరేశ్‌, చొప్పి రాజు, చిలువేరు అన్వేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్‌ క్రీడాకారిణికి..



వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన వాలీబాల్‌ జాతీయ క్రీడాకారిణి తాటికాయల మానస ఇటీవల ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలో ఫిజికల్‌ డైరెక్టర్‌గా ఉద్యోగం సాధించిన సందర్భంగా ఎక్లేసియా చర్చిలో పాస్టర్‌ సుమన్‌ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సీసీ గోలి కొమురయ్య మాట్లాడారు. యువత మానసను స్ఫూర్తిగా తీసుకుని లక్ష్య సాధన వైపు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ డైరెక్టర్‌ ఎల్లయ్య, అన్నపూర్ణ, బీర్రు కరుణాకర్‌, బీర్రు ఎల్లయ్య, స్వరూప, విజయ, గోలి పుల్లయ్య, శోభ, రజిత తదితరులు పాల్గొన్నారు.

జనసేన రాష్ట్ర నాయకుడితో భేటీ



నర్సంపేట : జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ప్రముఖ సినీ నటుడు సాగర్‌తో నర్సంపేట నియోజకవర్గ నాయకుడు మేరుగు శివకోటి యాదవ్‌ ఆదివారం భేటీ అయ్యారు. సాగర్‌ ఆహ్వానం మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శివకోటి కలిసి పార్టీకి సంబంధించిన పలు అంశాలు, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎదురైన ప్రతికూల పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా సాగర్‌ మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గంలో మళ్లీ పార్టీ బాధ్యతలు చేపట్టి ముందుకు నడవాలని శివకోటిని కోరారు. పార్టీ అధ్యక్షుడు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉన్న క్రమంలో పార్టీకి, ఇన్‌చార్జ్‌ పదవికి శివకోటి రాజీనామాపై అధ్యక్షుడి పవన్‌కళ్యాణ్‌ ఆమోదం పెండింగ్‌లో ఉందని చెప్పారు. రాజీనామాపై పునరాలోచించాలని శివకోటిని సాగర్‌ కోరారు. ఈ సందర్భంగా శివకోటి యాదవ్‌ మాట్లాడారు. పార్టీలో తిరిగి బాధ్యతలు చేపట్టే అంశంపై నిర్ణయం తీసుకోవడానికి సమాలోచన చేసేందుకు తనకు కొంత సమయం కావాలని చెప్పారు.

రాష్ట్ర కార్యదర్శి నియామకం

దామెర: మెపా (ముదిరాజ్‌ ఎంప్లాయిస్‌ అండ్‌ ప్రొఫెషనల్స్‌ అసోసియేషన్‌) రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని ల్యాదెల్లకు చెందిన పిట్టల రమేశ్‌ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్‌ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌ మాట్లాడారు. ముదిరాజ్‌ సంఘం బలోపేతం కోసం తన వంతు కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పండ్ల పంపిణీ

కాశిబుగ్గ : హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో వరంగల్‌ ఆర్‌పీఎఫ్‌ సిబ్బంది ఆదివారం పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు కేంద్రంలోని మానసిక వికలాంగులు, అనాథలతో మాట్లాడి మానసిక ధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్‌ ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

● మాజీ మంత్రి, ట్రస్ట్‌ చైర్మన్‌ దయాకర్‌రావు

పర్వతగిరి : మండల కేంద్రంలోని పర్వతాల శివాలయంలో మార్చి 8న శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు మాజీ మంత్రి, ట్రస్ట్‌ చైర్మన్‌ ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా తలపెట్టిన తాడు గుంజుడు పోటీల కరపత్రాలను ఆదివారం నాయకులు, ట్రస్ట్‌ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఏటా శివరాత్రి సందర్భంగా ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తాడు గుంజుడు పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.40 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు, నాల్గో బహుమతిగా రూ.10 వేలు ఇస్తామని తెలిపారు. శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు మండలంలోని ప్రముఖులతో కమిటీ ఏర్పాటు చేసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు చెప్పారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సదుపాయాలు కల్పించాలని, ఏర్పాట్లు చేయాలని చెప్పారు. శివరాత్రి ఉత్సవాలు జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్‌, ఎంపీటీసీ మాదుగుల రాజు, ఉపసర్పంచ్‌ రంగు జనార్దన్‌, ట్రస్ట్‌ సభ్యులు చిదురాల వేణుగోపాల్‌, వెంకన్న, భాస్కర్‌, దేవేందర్‌, కొమురయ్య పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, తదితరులు

బీఆర్‌ఎస్‌ బలోపేతానికి కృషి చేయండి

● జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌

వర్ధన్నపేట : వర్ధన్నపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ శ్రేణులను కోరారు. హనుమకొండలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్ధన్నపేటలో ఈనెల 29న పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్‌ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. కాంగ్రెస్‌ పార్టీ అనేక మోసపూరిత హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిందని తెలిపారు. సీఎంగా కేసీఆర్‌ నిత్యం ప్రజాసంక్షేమానికి పాటుపడ్డారని, నియోజకవర్గంలోని పేదలకు సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌ ఇచ్చిన హామీల అమలుకు ఆ పార్టీ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేలా పోరాడాలని చెప్పారు. శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉండాలని స్పష్టం చేశారు. రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి వరంగల్‌ స్థానంలో గెలిచేలా చొరవ చూపాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, నాయకులు గుజ్జ సంపత్‌రెడ్డి, అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరూరి రమేశ్‌

'ముదిరాజ్‌'ల అభివృద్ధే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న పెండ్యాల కృష్ణ

నర్సంపేట : ముదిరాజ్‌ కులస్తుల అభివృద్ధే ముదిరాజ్‌ ఎంప్లాయీస్‌ అండ్‌ ప్రొఫెషనల్స్‌ అసోసియేషన్‌ (మెపా) ధ్యేయమని జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ తెలిపారు. అసోసియేషన్‌ రాజకీయ నాయకులకు, పార్టీలకు అమ్ముడు పోదని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలోని అసోసియేషన్‌ డివిజన్‌ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్‌ రాష్ట్ర స్థాయిలో అనేక ఏళ్లుగా ముదిరాజ్‌ కులస్తుల అభివృద్ధి కోసం పాటుపడుతోందని చెప్పారు. అసోసియేషన్‌ను కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటూ రాజకీయ పార్టీలకు తాకట్టు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి ద్రోహులను తరిమికొట్టాలని కోరారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి స్వప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని వాపోయారు. అసోసియేషన్‌ డివిజన్‌ కన్వీనర్‌ పెండ్యాల యాదగిరి మాట్లాడుతూ డివిజన్‌లో అసోసియేషన్‌ బలోపేతానికి పాటుపడతామని చెప్పారు. ముదిరాజ్‌ కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల కుమార్‌, చిరంజీవి, నిమ్మన బోయిన అశోక్‌, మహేందర్‌, శ్రీను, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉద్యోగి మృతి



సూరయ్య (ఫైల్‌)

దుగ్గొండి : అనారోగ్యంతో ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన ఘటన మండలంలోని మదిరలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన బందెల సూరయ్య (58) గూడూరు మండలంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో సీనియర్‌ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆయన మూడు నెలల క్రితం రెండు కిడ్నీలు ఫెయిల్యూర్‌ కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారం రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. సూరయ్య తొలుత వీఆర్వోగా పని చేసి జూనియర్‌ అసిస్టెంగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఆర్‌ఐగా అనంతరం గూడురు మండల తహసీల్దార్‌ కార్యాలయంలో సీనియర్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇదే క్రమంలో గత మూడు నెలల క్రితం రెండు కిడ్నీలు ఫెయిల్యూర్‌ కావడంతో చికిత్స పొందుతున్నాడు. గత వారం రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

పొదుపుతో బంగారు భవిష్యత్‌



మాట్లాడుతున్న అధ్యక్షుడు కృష్ణ నిరంజన్‌

దుగ్గొండి : డబ్బు పొదుపు చేసుకుంటే బంగారు భవిష్యత్‌ ఉంటుందని ఆదర్శ పురుషుల పొదుపు సంఘాల సమితి అధ్యక్షుడు కృష్ణ నిరంజన్‌ తెలిపారు. మండలంలోని నాచినపల్లిలో కాకతీయ పురుషుల పొదుపు సంఘం 27వ వార్షిక మహాసభ నంగునూరి సాంబయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సభలో ఆర్థిక లావాదేవీల నివేదికను సంఘం అధ్యక్షుడు సాంబయ్య ప్రవేశ పెట్టారు. అనంతరం కృష్ణ నిరంజన్‌ మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సభ్యులే పాలకులుగా పొదుపు సంఘాల నిర్వహణ ముందుకు సాగుతోందని తెలిపారు. కేవలం రూ.50 పొదుపు బ్యాంక్‌లకు దీటుగా తయారు కావడం సభ్యుల ఐక్యతకు నిదర్శనమని చెప్పారు. సభ్యులు తనఖా లేకుండా బ్యాంక్‌ల కంటే తక్కువగా (9 శాతం) వడ్డీతో రూ.2 లక్షల వరకు అప్పు తీసుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ స్థాయికి ఎదగడం అభినందనీయమని తెలిపారు. సమాజంలోని ప్రతీఒక్కరు సంపాదించిన డబ్బులో కొంత క్రమశిక్షణతో పొదుపు చేసుకోవడాన్ని దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు పుచ్చ స్వామి, కాసిడి అజయ్‌, కొత్తపల్లి రాజయ్య, కొండబత్తుల నర్సింహరాములు, పెండ్యాల గిరి, పెండెం శ్రీనివాస్‌, ములక స్వామి, ఎరెల్లి రాజేందర్‌, తొగర్రాయి సంఘ అధ్యక్షుడు యార మహేందర్‌, సంఘ గణకుడు గుండెబోయిన రాజు, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్‌ ఇవ్వాలి

వర్ధన్నపేట : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నెలకు రూ.4 వేల చొప్పున పింఛన్‌ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎస్‌ఎస్‌) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి కోరారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో కలిసి పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక మంది పేదలు షుగర్‌, బీపీ, డయాలిసిస్‌, హెచ్‌ఐవీ, తదితర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో సతమతమౌతూ వైద్యం చేయించుకోలేని దుస్థితిలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అలాంటి వారికి ప్రభుత్వం ప్రతీనెల పింఛన్‌ ఇవ్వడంతోపాటు ఉచితంగా కార్పొరేట్‌ స్థాయి వైద్యం అందించాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేలా విద్యారంగంలోని ఉద్యోగ ఖాళీలన్నిటినీ వెంటనే భర్తీ చేయాలని, కంప్యూటర్‌ విద్యను అందించాలని ఆకాంక్షించారు. పాస్టర్లకు భృతి అందించాలని, క్రిస్టియన్లకు దళిత హోదా కల్పించాలని, దళితులను వేద పాఠశాలల్లో చదివించి ఆలయాల్లో అర్చకులుగా నియమించి మానవులంతా ఒక్కటే అని చాటాలని కోరారు.



మాట్లాడుతున్న కుమారస్వామి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



నర్సంపేట రూరల్‌ : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని లక్నేపల్లి శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నల్లబెల్లి మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన వైనాల రాము, లక్ష్మణ్‌, క్రాంతి హైదరాబాద్‌ నుంచి కారులో స్వగ్రామానికి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు లక్నెపల్లి శివారులోని కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న రాము, లక్ష్మణ్‌, క్రాంతి తీవ్ర గాయాలపాలై కారులోనే ఇరుక్కపోయారు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను కారులోంచి బయటకు తీసి వరంగల్‌లోని ఆస్పత్రికి పంపించారు.

యూత్‌ కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడిగా షఫీక్‌

నర్సంపేట : యూత్‌ కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎస్కే.షఫీక్‌ నియమితులయ్యారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో షఫీక్‌కి పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్‌, నియోజకవర్గ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్‌ ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా షఫీక్‌ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో యూత్‌ కాంగ్రెస్‌ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్‌, పట్టణ కార్యదర్శులు చిప్ప నాగ, మోటం రవికుమార్‌, ఓబీసీ పట్టణ ప్రధాన కార్యదర్శి నాడెం నగేశ్‌, 8వ వార్డు అధ్యక్షుడు గిరగాని రమేశ్‌, 14వ వార్డు అధ్యక్షుడు డిష్‌ బాబా, నర్సంపేట మండల యూత్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి బొంత రంజిత్‌, యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు ములుకల మనీష్‌, గోక వేదప్రకాశ్‌, న్యాతని రాంప్రసాద్‌, చెన్నబోయిన సాయిశ్రావణ్‌, కొత్తగట్టు ప్రశాంత్‌, తదితరులు పాల్గొన్నారు.



షఫీక్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాజేందర్‌, ఇంద్రదేవ్‌

జీపీ మాజీ పాలకవర్గానికి సన్మానం



ఎల్లయ్యను సన్మానిస్తున్న అధికారులు, గ్రామస్తులు

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి గ్రామ పంచాయతీ మాజీ పాలకవర్గాన్ని అధికారులు, గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గా సేవలు అందించిన బోనగిరి ఎల్లయ్యను, వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించారు. మాజీ పాలకవర్గం అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్పెషల్‌ ఆఫీసర్‌ శ్రీప్రియ, ఎంపీటీసీ బిజ్జాల సంధ్య సోమయ్య, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌ నాయక్‌, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు



యువకులకు కౌన్సెలింగ్‌ ఇస్తున్న ఎస్సై సందీప్‌

రాయపర్తి : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్సై వడ్డె సందీప్‌కుమార్‌ స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి వేళ ఆయన పెట్రోలింగ్‌ నిర్వహిస్తూ ఆ సమయంలో రోడ్లపై తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్‌ చేశారు. అకారణంగా రాత్రి వేళల్లో రహదారుల్లో తిరుగవద్దని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడ్డా కేసులు నమోదు చేసి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత సన్మార్గంలో నడిచి సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. చెడు అలవాట్లకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు.

వైభవంగా షహీద్‌ దర్గా ఉత్సవాలు

ఖిలావరంగల్‌: మధ్యకోటలోని హజ్రత్‌ చందా షహీద్‌ దర్గాలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మహ్మద్‌ రఫీక్‌, ఉపాధ్యక్షుడు సయ్యద్‌ గౌస్‌, మహ్మద్‌ జహీద్‌ ఆధ్వర్యంలో గంధం, ఉర్సు ఉత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ముగిశాయి. దర్గాను ముస్లిం మత గురువులు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతాలకతీతంగా పెద్దఎత్తున భక్తులు దర్గాపై పూలుచల్లి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యఅతిథిగా కరీమాబాద్‌ ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా, స్థానిక కార్పొరేటర్‌ ఉమ, మాజీ కార్పొరేటర్‌ దామోదర్‌ హాజరై దర్గాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో గౌస్‌బాబా, వలీ మహ్మద్‌, ఎగ్బాల్‌ హైమద్‌, సలీమ్‌, తదితరులు పాల్గొన్నారు.



దర్గాను దర్శించుకుంటున్న ముస్లిం మతపెద్దలు

పరామర్శ



చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడకు చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ మండల నాయకుడు తూటి శ్రీనివాస్‌ను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. శ్రీనివాస్‌ తండ్రి సమ్మయ్య గతేడాది మృతి చెందిన ఆదివారం ఆయన ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హాజరై సమ్మయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు

● అసిస్టెంట్‌ కమాండెంట్‌ వేణుగోపాల్‌రెడ్డి

ఖిలా వరంగల్‌: విద్యార్థులు చదువుతో పాటు ఏకాగ్రతను పెంపొందించుకుంటే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అసిస్టెంట్‌ కమాండెంట్‌ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఖిలావరంగల్‌ మండలం మామునూరు టీఎస్‌ఎస్పీ నాలుగో బెటాలియన్‌ ప్రాంగణంలోని టీఎస్‌ఎస్పీ కృష్ణవేణి హైస్కూల్‌లో పాఠశాల చైర్మన్‌ పట్నాల శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్‌ బి. సత్యనారాయణ అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్‌ కమాండెంట్‌ మాట్లాడుతూ పరీక్షల సమయంలో నిరాశ, నిస్పృహ, నిస్సహాతలోనుకాకుండా ప్రణాళిక ప్రకారం చదివి విజయం సాధించాలన్నారు. పరీక్ష రాసేముందు రాత్రి ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా నిద్రించాలన్నారు. పరీక్షలో అత్యధికశాతం ఉత్తీర్ణత సాధించి గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరుతీసుకురావాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, ఆటపాట కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలు నిర్వహించడం అభినందనీయం



బహుమతులు అందజేస్తున్న సీఐ సంజీవ్‌

తొర్రూరు: ట్రాస్మా ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమని సీఐ సంజీవ్‌ అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజన్‌ కేంద్రంలోని ట్రాస్మా ఆధ్వర్యంలో అభ్యాస్‌ స్కూల్‌లో క్రీడలు నిర్వహించారు. అనంతరం ముత్తినేని ప్రకాష్‌ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీషర్టులను దాత తాళ్లపల్లి రమేష్‌, ట్రాస్మా రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌ రెడ్డి, జిల్లా సెక్రెటరీ ఏకాంతం, సలహాదారులు దేవేందర్‌ రెడ్డి, చెంబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుదీప్‌ శర్మకు డాక్టరేట్‌

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు తాటిపాముల అనుదీప్‌ శర్మ ఆస్ట్రాలజీ స్పిరిచ్వాలి రీసెర్చ్‌లో గౌరవ డాక్టరేట్‌ పట్టా అందుకున్నారు. తమిళనాడులోని హుసూర్‌లో ఆసియా ఇంటర్నేషనల్‌ కల్చర్‌ రీసెర్చ్‌ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టా అందుకున్నారు. ఆయనను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనకు అభిప్రాయ సేకరణ

ఖిలా వరంగల్‌: వరంగల్‌ శంభునిపేటలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన అభిప్రాయ సేకరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కోసం స్థానిక ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కాలనీ ప్రజలందరూ బొడ్రాయి ప్రతిష్ఠాపనకు సుముఖత వ్యక్తం చేశారు. వేద పండితులు పోలోజు భాస్కరాచారీ హాజరై ఉత్సవ ప్రతినిధులతో కలిసి స్థలపరిశీలన చేశారు. మార్చి 3న మరోసారి సమావేశమై తేదీలు ప్రకటిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ పోశాల పద్మ, దేవులపల్లి దయాకర్‌, సత్యనారాయణ, కర్నె రవీందర్‌, పసునూరి కోటేశ్వర్‌, పస్తం భిక్షపతి, కందికొండ మోహన్‌, విజయ్‌, కత్తి సాంబయ్య, బిల్లా ప్రభాకర్‌, ఎల్లాగౌడ్‌, సదానందం, శ్రీరామ్‌ నగర్‌ కాలనీవాసులు పాల్గొన్నారు

రైతులపై కాల్పులు దురదృష్టకరం

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామస్వామి

ఖిలా వరంగల్‌ : గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్‌ చేస్తూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వ ప్రోద్బలంతో పోలీసులు కాల్పులు జరపడం దురదృష్టకరమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి అన్నారు. రైతన్నలపై అమానుషంగా పోలీసులు జరిపిన కాల్పులతో ఐదుగురు మృతి చెందడాన్ని నిరసిస్తూ వరంగల్‌లోని కరీమాబాద్‌ రోడ్డుపై ఆ యూనియన్‌ ఆధ్వర్యంలో ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడారు. ఢిల్లీలో రైతులు శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేస్తుంటే నిరంకుశంగా రైతులపై హర్యానా, పంజాబ్‌ సరిహద్దు పోలీసులు విచక్షణ రైతంగా కాల్పులు జరిపారని తెలిపారు. పోలీసుల కాల్పుల్లో ఐదుగురు రైతులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వెనకాల ప్రధాని మోదీ హస్తం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, యాకూబ్‌పాషా, యాదగిరి, మహబూబ్‌ , సదానందం, రాజ్‌కుమార్‌, ఇస్మాయిల్‌, పెంటయ్య, జహీదా, జుబేదా, మార్గం కిరణ్‌,ఎల్లమ్మ, బాలు, మహేష్‌, నగేష్‌, కైలాసం, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

యువతికి ఆర్థికసాయం



ఖిలా వరంగల్‌ : వరంగల్‌ శివనగర్‌ భూపేష్‌నగర్‌కు చెందిన తల్లిదండ్రులు లేని ఉప్పల అనూషకు ఆదివారం కరాటే ప్రభాకర్‌, ఉమా దంపతులు స్పందించి రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. గత ఐదునెలల క్రితం అనారోగ్యంతో అనూష సోదరుడు ఉప్పల అనిల్‌ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో ఆ యువతి తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కరాటే ప్రభాకర్‌ దంపతులు ముందుకు వచ్చి రూ. 25వేలు ఆర్థిక సాయం అందజేసి తన సేవాదృక్పదాన్ని చాటుకున్నారు. అందజేసిన వారిలో అజీరా, అరుణ, యాకూబ్‌, మంజు, సుమ, సౌజన్య, యాకమ్మ, సుమలత, జైతూన్‌, మహబూబీ తదితరులు ఉన్నారు.